క్లుప్తంగా

గూడూరును సుందరంగా తీర్చిదిద్దాలి

గూడూరురూరల్ : పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని షాదీ మంజిల్‌లో శనివారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, అసాంఘిక కార్యకలాపాలు, ప్లాస్టిక్‌ను ఎక్కడపడితే అక్కడ వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పనితీరు ఆశించిన మేర లేదని అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్చాలి

సూళ్లూరుపేట రూరల్: బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సీఎంఆర్టీ అంకయ్య తెలిపారు. సూళ్లూరుపేట మండలంలోని కొరిడిలో సీఎంఆర్టీ శనివారం పరిశీలించి, చేపలు పట్టుకుంటున్న గిరిజన పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పించాలన్నారు.

అన్నదానం

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి మోమిడి గ్రామానికి చెందిన మేగనూరు శ్రీనివాసులు, మౌనిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఈఓ బాధ్యతల స్వీకరణ

తాతా శ్రీనివాసరావు కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఇన్‌చార్జి ఈఓగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఈఓను ఆలయ చైర్మన్ సత్కరించారు.

ఆర్బీకేల్లో ఈ–క్రాప్ జాబితా

చిల్లకూరు: సాగులో ఉన్న పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాను ఆయా ఆర్బీకేల్లో ప్రదర్శించామని ఏఓ గూడూరు భవానీ తెలిపారు. శనివారం మండలంలోని తూర్పుకనుపూరు, బల్లవోలు గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రైతుభరోసా, సున్నా వడ్డీ, పంటల బీమా, మద్దతు ధర తదితర పథకాలు రైతులకు అందాలంటే ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 30వ తేదీలోగా రాత పూర్వకంగా ఆయా ఆర్బీకేల్లో అందించాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు వెంకటకృష్ణయ్య, విజయమ్మ, ఎస్‌కే నసిఫా తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రొక్లెయినర్ల సీజ్



పోలీసులు సీజ్ చేసిన ప్రొక్లెయినర్లు

సైదాపురం: చెరువులో అక్రమంగా ఖనిజం తవ్వుతున్న రెండు ప్రొక్లెయినర్లను శనివారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ చల్లా వాసు మాట్లాడుతూ మండలంలోని రాజులెరుగుంటపాళెం సమీపంలోని చెరువు వద్ద అక్రమంగా మైనింగ్ తవ్వుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో అక్కడ ఖనిజం తవ్వుతున్న రెండు ప్రొక్లెయినర్లను సీజ్ చేశామన్నారు.

పూరిల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని తిక్కవరంలో శనివారం ఓ పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దువ్వూరు మునిచంద్రారెడ్డికి చెందిన ఓ పూరిల్లు రోడ్డు పక్కనే ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిపై నిప్పు వేయడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి, మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందజేశారు. అయితే వారు గూడూరు నుంచి వచ్చి, మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంటితోపాటు సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

కండలేరులో 11.424 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 11.424 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే సురక్ష ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే జగనన్న ఆరోగ్య సురక్ష ధ్యేయమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు సీఎస్ఎం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే రాష్ట్రానికి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, సీనియర్ నాయకులు బీ విజయకుమార్, ఏ మురళి, అజీజ్‌ఖాన్, అల్తాఫ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

చిల్లకూరు: ఆరోగ్యమే మహాభాగ్యమని భావించిన ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తుందని ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. మండలంలోని తిక్కవరంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు అరాఫత్, పాల్ జాన్సన్ రోగులకు పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సతీష్‌రెడ్డి, సుభాషిణి, ఈఓపీఆర్డీ మాణిక్యం, కార్యదర్శి రమణయ్య, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

సూళ్లూరుపేటరూరల్ : పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 500 పైగా ప్రజలు వైద్య శిబిరానికి విచ్చే పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఐ.రమణయ్య, లావణ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రద్దగుంటలో..

ఓజిలి: మండలంలోని గ్రద్దగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్యులు కంటి, రక్త, బీపీ, షుగర్, స్త్రీలకు గర్భకోశ ఇతర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, వైద్యులు మోహన్ రంగ, డానియల్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దక్కిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కల్యాణ చక్రవర్తి తెలిపారు. శనివారం మండలంలోని శ్రీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రమీల, వెంకటలక్ష్మి, బీ కీర్తి, నాగ రమణి, సుమ గీతిక, సర్పంచ్ ఎస్ వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.



చిల్లకూరు: పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇంటివద్దకే కార్పొరేట్ వైద్యం

రాపూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం అందుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి అన్నారు. రాపూరు మండలం బొజ్జనపల్లెలో శనివారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పాజీ, వైద్యులు సూర్యధర్మేంద్ర, చంద్రారెడ్డి, నర్మదాదేవి, అంజలి సుదర్శనమ్మ పాల్గొన్నారు.

విద్యాబోధనపై దృష్టి సారించాలి

గూడూరురూరల్: ఉపాధ్యాయులు విద్యాబోధనపై దృష్టి సారించాలని డీ ఈఓ శేఖర్ సూచించారు. గూడూరులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పిల్లల చదువులపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపడం లేదన్నారు. ఆరో తరగతిలో చేరిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపకుండా బాగా చదవడం లేదనే సాకుతో వదిలేస్తున్నారన్నారు. అప్పుడు చదవకపోతే ఇప్పుడు చదవలేరని? మీరెలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయులు కూడా తరగతి గదులను పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ప్రతి విద్యార్థీ ఉన్నతంగా చదివేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి, సీఎంఓ సురేష్, ఎంఈఓ సనత్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పేదల అభ్యున్నతే సీఎం జగనన్న లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య.

పెళ్లకూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు నేరుగా అందిస్తూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, ఆయన్ని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం కలవకూరులో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఫ్యామిలీ డాక్టర్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసిన తరువాత, పూర్తిగా వ్యాధి నయం చేసి సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత విషయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, జేసీఎస్ మండల కన్వీనర్ కే రఘునాయుడు, పార్టీ మండల కన్వీనర్ వెంకటరత్నం, సర్పంచ్‌లు రాంబాబు, చెంచురామయ్య, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, చంద్రారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, విజితారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ గోపీనాయక్

గూడూరురూరల్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఏడీఏ గోపీ నాయక్ తెలిపారు. గూడూరులోని వెలుగు కార్యాలయంలో శనివారం గూడూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ గోపీ నాయక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపేలా వారికి అందుబాటులో ఉంటూ అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా యాంకర్ రవిచంద్రప్రసాద్ మాట్లాడుతూ తక్కువ విస్తీర్ణం, తక్కువ పెట్టుబడి, ఎక్కువ పంటలు, ఎక్కువ ఆదాయం వచ్చేలా ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, డీపీ మోడల్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. టెక్నికల్ ఏఓ చెంచురెడ్డి మాట్లాడుతూ రైతులను మొదటగా 20 సెంట్లతో మొదలు పెట్టి తరువాత పూర్తి విస్తీర్ణంలోకి మార్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంఎంటీ వీరరాగయ్య, మాస్టర్ ట్రైనర్ తిరుమల, గూడూరు, చిల్లకూరు మండలాల ఇన్‌చార్జిలు పెంచలయ్య, కృష్ణయ్య, సబ్ డివిజనల్ యాంకర్ ఎం.పెంచలయ్య పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో పంటకు ఎరువులు



డ్రోన్ సాయంతో ఎరువులు పిచికారి

దొరవారిసత్రం: మండలంలోని ఆనేపూడి పరిధిలో ఎలిది పైరుకు స్థానిక వ్యవసాయాధికారులు ప్రయోగాత్మకంగా శనివారం డ్రోన్ సాయంతో 19–19–19, 13–0–45, నానో యూరియా, నానో డీఏపీలను ఒక్కొక్క ఎకరాలో గరుడ కంపెనీ వారి సహాయంలో పిచికారి చేశారు. ఈ ప్రయోగం ఫలితాలు వచ్చిన తరువాత గ్రామంలోని ఇతర రైతుల పొలాల్లో కూడా డ్రోన్‌తో ఎరువులు పిచికారి చేసేలా చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఏడీఏ అనిత తెలిపారు. పూలతోట, కల్లూరు, వేణుంబాకం, తనియాలి, కొత్తపల్లి గ్రామాల్లో సాగులో ఉన్న వరి పంటను వారు సందర్శించారు. ఇప్పటి వరకు మండలంలో ఎలిది పైరు 5,200 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

కమనీయం..లక్ష్మీనరసింహుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దక్కిలి: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి కల్యాణం కమనీయంగా సాగింది. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి రథయాత్ర భాగంగా దక్కిలిలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, ముత్యాల తలంబ్రాలు, అశేష భక్త జనసందోహం నడుమ స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారి కల్యాణం నిర్విఘ్నంగా జరగడానికి విశ్వక్సేనపూజ చేశారు. ఉదయం దక్కిలిలో లక్ష్మీనరసింహస్వామి రథయాత్ర జరిపారు. శ్రీపురం గ్రామానికి చెందిన జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ సీ శంకరరెడ్డి, నాయకులు ఎం నారాయణరెడ్డి, డీ రవీంద్రారెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసులు నాయుడు, కే వేణుగోపాల్, బీ భాస్కర్‌నాయుడు, డీపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీయాగం



చండీయాగం చేస్తున్న అర్చకులు

చిల్లకూరు: పౌర్ణమి సందర్భంగా ముత్యాలమ్మ ఆలయంలో శనివారం చండీయాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో యాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యాగానికి గూడూరుకు చెందిన టమాట వ్యాపారి సెల్వరాజ్, దేవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డీ చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ తనూజారెడ్డి

వెంకటగిరిరూరల్: అధికారుల సమన్వయంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత మండలంలోని పలు శాఖలకు సంబంధించిన అధికారులు వారి వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ దేశాభివృద్ధికి పట్టుగొమ్మలైన గ్రామాల అభివృద్ధిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, గాంధీజీ గ్రామ స్వరాజ్యం కల సాకారం చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ఇంటి వద్దకే పరిపాలన అందిస్తూ దేశానికే ఆదర్శమైన ముఖ్యమంత్రిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కే శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీలు సుధాకర్, పెంచలయ్య పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రాపూరు: రక్తదానం చేస్తున్న యువకులు



రక్తదానం చేస్తున్న పోలీసు కానిస్టేబుల్

రాపూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రాపూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని సీఐ సుబ్రమణ్యం తెలిపారు. రాపూరు సర్కిల్ పరిధిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని యువకులు 54 మంది ముందుకు వచ్చి రక్తం దానం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మాల్యాద్రి , ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, వైద్యులు సరస్వతి, రేష్మ, సందీప్, మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా రక్తదాని శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేసి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సూమారు 50 మంది పైగా రక్తదానం చేశారు. సీఐ మధుబాబు, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు, ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత



చిల్లకూరు: మూసివేసిన ముత్యాలమ్మ ఆలయం

చిల్లకూరు: చంద్రగ్రహణం కారణంగా శనివారం మండలంలోని పలు ఆలయాలను మూసి వేశారు. పౌర్ణమి అయినప్పటికీ చంద్రగ్రహణ గడియలు రాక ముందు నుంచే ఆలయాలను మూసివేసి, భక్తులకు దర్శనం నిలిపి వేశారు. ఆలయ ఈఓలు మాట్లాడుతూ చంద్రగ్రహణం ఆదివారం ఉదయం వరకు ఉంటుందని, ఏడు గంటల పైన సంప్రోక్షణ చేసి, ఆలయాలను తిరిగి తెరుస్తారని తెలిపారు.



లక్ష్మీనరసింహస్వామి గుడిని మూస్తున్న అర్చకులు

సభ్యుల ఆర్థికాభివృద్ధికే పథకాలు



మాట్లాడుతున్న సెర్ఫ్ ఈడీ సత్యభామ

ఓజిలి: సంఘబంధాల్లోని సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని సెర్ఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యభామ అన్నారు. మండలంలోని ఓజిలి వెలుగు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతినెలా సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకుని, సంఘాల పనితీరు, సభ్యులు ఆర్థిక అక్షరాస్యత, రుణాల రికవరీ తదితర అన్ని అంశాలను చర్చించాలన్నారు. ఐబీ డీపీఎం మాధవి, ఏపీఎం నిర్మలమ్మ, సీసీలు శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



నివాళులర్పిస్తున్న కమాండెంట్ ప్రకాష్

వెంకటగిరిరూరల్: మండలంలోని వల్లివేడు వద్ద ఉన్న 9వ బెటాలియన్‌లో కమాండెంట్ పి ప్రకాష్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమాండెంట్ ప్రకాష్ మాట్లాడుతూ నేటి తరం మహనీయుల జీవితాలను ఆదర్శవంతంగా తీసుకోని రాణించాలన్నారు. సమాజంలో అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ రానున్న తరానికి ఆదర్శవంతంగా నిలివాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీవీ రామ్‌కుమార్, డీఎస్పీ ఎంఎల్ మనోహర్, అసిస్టెంట్ కమాండెంట్, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయం మూత



మూసివేసిన చెంగాళమ్మ ఆలయం

సూళ్లూరుపేట రూరల్: చంద్రగ్రహణం సందర్భంగా సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయాన్ని శనివారం సాయంత్రం అధికారులు మూసి వేసి, దర్శనాలు నిలిపివేశారు. ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఆలయ మూసివేస్తున్నట్లు ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయ శుద్ధి చేసిన అనంతరం 7.30 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

గురుకులంలో టాస్క్‌ఫోర్స్ బృందం



అటల్ టింకరింగ్ ల్యాబ్ పరికరాలపై అవగాహన కల్పిస్తున్న బృందం

నాయుడుపేట: స్థానిక అంబేడ్కర్ బాలుర గురుకులం పాఠశాలను శనివారం టాస్క్‌ఫోర్సు బృందం సదర్శించింది. ఈ సందర్భంగా ఆ బృందం ల్యాబ్‌ను పరిశీలించింది. ఆ బృందం సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై పెంపుదలకు ఉపయోగపడే వస్తు సామగ్రిని అటల్ టింకరింగ్ ల్యాబ్ పరికరాలను గురుకులాలకు ప్రభుత్వం అందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ పరికరాలు విద్యార్థులకు ఉపయోగపుతున్నాయా? అవి వినియోగంలో ఉన్నాయా లేదా? అని పరిశీలించి, విద్యార్థులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి మల్లికార్జున్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి పి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు శేఖర్‌బాబు, జీవీ రమణయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీ.. ఒకరి మృతి



ఘటనాస్థలంలో పోలమ్మ మృతదేహం

వెంకటగిరిరూరల్: ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్, ఆటో ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందగా, ఆటో లో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన వెంకటగిరి మండలం సరిహద్దులోని శ్రీకాళహస్తి రూరల్ మండలం ఇలగనూరు వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వెంకటగిరి రూరల్ మండలం కె ఉప్పరపల్లెకు చెందిన కోవూరు పోలమ్మ(60) డయాలసిస్ నిమిత్తం ఆటోలో ఉప్పరపల్లె నుంచి తన కుమార్తె అమరావతితో కలసి వెంకటగిరి వస్తున్నారు. ఈ క్రమంలో ఇలగనూరు వద్ద ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఉప్పరపల్లెకు చెందిన పోలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా ఆమె కుమార్తె అమరావతి, అందులో ప్రయాణిస్తున్న అదే గ్రామానికి చెందిన కలపాటి సంపూర్ణ గాయపడ్డారు. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయట పడ్డారు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి పోలీసులు ఘటన స్థలానికి చేరు కుని పోలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

వెంకటగిరి రూరల్: అనుమానాస్పద స్థితిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందిన ఘటన పట్టణంలోని ఐఐహెచ్‌టీ ఎదురుగా ఉన్న ఓ భవనంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతిలోని ఉప్పరపల్లెకు చెందిన మేరకు ఇల్లా చల్లాకుమార్ (16) స్థానిక పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు విద్యార్థి శుక్రవారం నుంచి కనిపించకపోవడంతో తోటి విద్యార్థి వెంకటేష్ వెదకడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఐఐహెచ్‌టీ ఎదురుగా ఉన్న ఓ గదిలో అనుమానాస్పద స్థితిలో చల్లాకుమార్ మృతి చెంది ఉండడాన్ని గుర్తించి, అతని తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.